

జగిత్యాలలో విషాదం
● మహారాష్ట్ర వరదలో గల్లంతైన ఇద్దరు మహిళల మృతదేహాలు లభ్యం 6

పంచేంద్రియాలకు శిక్షణ
● కస్తూర్బాల్లో 'బ్రైటర్ మైండ్స్' ట్రైనింగ్‌తో అద్భుత ఫలితాలు
● అబ్బురపరుస్తున్న విద్యార్థులు 7

22న జాబ్ మేళా

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్‌రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల22న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి సత్యమ్మ తెలిపారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌కోరుట్లలో గల ఆఫీస్ స్టాఫ్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఖాళీల భర్తీకోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు కోరుట్లలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వేతనం నెలకు రూ. 20వేల నుంచి రూ.25వేల వరకు ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ నెల 22న ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే జాబ్‌మేళాకు సంబంధిత ధృవపత్రాలతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఇంటర్వ్యూలు కలెక్టర్ కార్యాలయ సముదాయ భవనంలోని రెండవ అంతస్తులో రూం.నెం 218నందు గల జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో జరుగునని, అభ్యర్థులు గమనించాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ లబ్ధిదారులకు షాదిముబారక్, కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. 75 మంది లబ్ధిదారులకు రూ. 75,08,700 విలువ షాదిముబారక్, కళ్యాణ లక్ష్మీ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్య, నాయకులు పహీం, అన్వర్, రమేష్, నత్తి రాజుకుమార్, నగేష్, పిడుగు సందయ్యలతో పాటు నాయకులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే ఎస్సెస్సీ పరీక్షలు

● రాత పరీక్షకు 80, ఇంటర్నల్స్‌కు 20 మార్కులు..
● ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ డైరెక్టర్
● ఉపాధ్యాయ సంఘాల మిశ్రమ స్పందన



జగిత్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు పాత పద్ధతిలోనే జరగనున్నాయి. ఈ విద్యా సంవత్సరం కూడా రాత పరీక్షకు 80 మార్కులు, ఇంటర్నల్‌కు 20మార్కులను యథావిధిగా కొనసాగిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటర్నల్ మార్కుల విధానాన్ని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు స్వాగతిస్తుండగా, విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచిన తర్వాత విద్యాశాఖ ఆదేశాలు ఇవ్వడంపై మరికొన్ని సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. పరీక్షలపై ప్రభుత్వానికే స్పష్టత లేకపోతే విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొంటున్నాయి. విద్యాహక్కుచట్టం ప్రకారం 2011 నుంచి 80మార్కులకు రాత పరీక్ష, 20 మార్కులకు ఇంటర్నల్ నిర్వహిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు 20కి 20ఇంటర్నల్ మార్కులు వేస్తున్నారన్న విమర్శలున్నాయి. దీంతో 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్నల్ మార్కుల విధానాన్ని రద్దు చేసి 100మార్కులకు పరీక్షలు నిర్వహిస్తామని ప్రతిపాదన చేసింది. దీన్ని ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేటుస్కూల్ యజమాన్యాలు వ్యతిరేకించడంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని గతయేడాది వెనక్కి తీసుకుంది. తాజాగా 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభమైన రెండు నెలల తర్వాత పాత విధానాన్నే కొనసాగిస్తున్నట్లు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

● ఎన్‌సీఈఆర్‌టీ అభిప్రాయం మేరకే...

పదో తరగతిలో ఇంటర్నల్ మార్కులను రద్దు చేయడంపై జాతీయ విద్యాపరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ప్రభుత్వాన్ని ప్రశ్నిం చినట్లు తెలిసింది. సీబీఎస్ఈ పదోతరగతిలో 20శాతం ఇంటర్నల్స్, 80శాతం వార్షిక పరీక్షలకు మార్కులు కేటాయిస్తే తెలంగాణలో ఇంట ర్నల్స్‌ను ఎలా రద్దు చేస్తారని ఇటీవల నిర్వహించిన వర్క్‌షాప్‌లో రాష్ట్ర విద్యాశాఖ అధికారులతో చర్చించినట్లు సమాచారం. దీంతో విద్యాశాఖ అధికారులు పాత విధానాన్ని యథావిధిగా అమలు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

● జిల్లాలో 4,156 మంది పదో తరగతి విద్యార్థులు

జిల్లాలో ప్రభుత్వ, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, ప్రైవేటు పాఠశాలలతో కలిపి 219 హైస్కూల్స్ ఉండగా 2025-26 విద్యా సంవత్సరానికి గాను 4,156మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో విద్యాశాఖ 100మార్కులకు వార్షికపరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించింది. దీంతో ఉపాధ్యాయు లంతా విద్యార్థులను సబ్జెక్టు వారీగా రెండు నెలలుగా 100 మార్కుల పేపరుకు సన్నద్ధం చేస్తూ వచ్చారు. ప్రస్తుతం విద్యాశాఖ 80మార్కులకు రాత పరీక్షలు, 20ఇంటర్నల్ మార్కులు అని తాజాగా ఆదేశాలి వ్వడంతో ఉపాధ్యాయులు అయోమయంలో పడ్డారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన..

- మిగతా 8లో

నాణ్యమైన బోధనకే టీఎల్‌ఎం మేళాలు

● డీఈవో రాము నాయక్



పరిశీలిస్తున్న డీఈవో రాము నాయక్

గొల్లపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): టీఎల్‌ఎం మేళాలు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనను అందించేందుకు తోడ్పడతాయని డీఈవో రాము నాయక్ పేర్కొన్నారు. మంగళవారం గొల్లపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో టీఎల్‌ఎం మేళాను నిర్వహించగా డీఈవో రాము నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ టీఎల్‌ఎం నిర్వహణ లక్ష్యాలు ప్రధానంగా పరిచయం, వినియోగం, సమీకరణ, ప్రభావాన్ని మెరుగుపర్చడంతో పాటు విద్యార్థుల బోధనను సులభతరం చేయడంకోసం రూపొందించబడ్డాయన్నారు. శిక్షణా పరికరాలను గుర్తించడం, ప్రాముఖ్యతను వివరించడం, ఉపాధ్యాయులు, విద్యార్థులు సులభంగా వినియోగించుకునేలా చేయడం, బోధన ప్రక్రియలో టీఎల్‌ఎం వినియోగాన్ని పెంపొందించడం, కొత్త పద్ధతులు, వినూత్న ఉపకరణాలను పాఠశాలల్లో ప్రవేశపెట్టడం తదితర టీఎల్‌ఎం మేళా ముఖ్యోద్దేశాలన్నారు. ఉపాధ్యాయులు ఇలాంటి మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల్లో మౌలిక అవగాహన, సృజనాత్మకత, భావ ప్రకటన, సమస్యలను పరిష్కరించుకునే సామర్థ్యం వంటి ముఖ్యమైన నైపుణ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం టీఎల్‌ఎం మేళాలో ప్రదర్శించిన బోధనాభ్యాస సామగ్రిని పరిశీలించారు. 35 పాఠశాలలకు చెందిన 124 నమూనాలను తయారు చేసి ప్రదర్శించినట్లు, ప్రతి పాఠశాల నుంచి సబ్జెక్టుకు ఒకటి చొప్పున 4 సబ్జెక్టులలో 4 నమునాలు తీసుకు రావడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మజీద్, ఎంపీడీవో రాం రెడ్డి, ఎంఈవో చెరుకు రాజన్న, మొగిలి రవి, మహేష్, సురేష్, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, గంగా రెడ్డి, వనిత, రమేష్, పూర్ణచంధర్, మంజుల, సుజాత, శిరీష, మురళి, గంగారాజం, గంగారెడ్డి, వెంకటేష్, తదితర ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై దృష్టి

కథలాపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలి మూగజీవాలు మృత్యువాత పడే అవకాశం ఉన్నందువల్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్యాధికారి వేణుగోపాల్‌రావు సూచించారు. మండలంలోని అంబారిపేట, కథలాపూర్ పశువైద్యశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి మందుల నిల్వలు, హాజరు పట్టికను పరిశీలించి పలు సూచనలు చేశారు. పిడుగులు పడి పశువులు మృతి చెందితే ఆ వివరాలు వెంటనే నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సీజన్‌లో గొర్రెల్లో కాళ్ళు ఉబ్బడం, డయేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అవసరమైన చోట ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సంద ర్భంగా పశువైద్యాధికారులు అంకం శ్రీనివాస్, దివ్యశ్రీ, సిబ్బంది ఉన్నారు.

గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వాల్గొండ శివారులోని గోదావరిని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్

మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్

మల్లాపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గోదావరినది పరివాహక తీర ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండలంలోని వాల్గొండ గ్రామ శివారులోని గోదావరి నదిని పరిశీలించారు. వరద ప్రవాహం వల్ల ఇళ్లలోకి నీరు వచ్చే గ్రామ స్థలతో మాట్లాడి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో శశికుమార్, ఆర్ఐ రాజేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

●ఇబ్రహీంపట్నం: గోదావరి నది తీర ప్రాంత ప్రజలు భారీ వర్షాలు నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మెటపలి ఆర్డీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని ఎర్దండీ గోదావరినది పరివాహకప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో 39గేట్ల ద్వారా గోదావరి నదిలోకి నీటి విడుదల చేశారని, చేపల వేటకు వెళ్లొద్దని ఆదేశించారు. ఆయన వెంట తహసిల్దార్ వరప్రసాద్, పంచాయతీ సెక్రెటరీ మనోజ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆశావర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



పెగడపల్లిలో ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

పెగడపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పెగడపల్లి మండలంలో ఆశా కార్యకర్తలు మంగళవారం నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పనిచేసే ఆశా కార్యకర్తలు ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల నాయకులు, వర్కర్లు పాల్గొన్నారు.

● కొడిమ్యాల, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలను చెల్లించాలని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మంగళవారం మండలంలోని ఆశావర్కర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు జీవలక్ష్మీ మాట్లాడుతూ తాము చేస్తున్న సేవలను గుర్తించి 18 వేల రూపాయల ఫిక్స్‌డ్ వేతనం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. హెల్త్ కార్డులను అందిస్తూ, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కలిపించాలని కోరారు. ప్రతి నెల 1వ తేదిన వేతనం వచ్చు విదంగా చూడాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆశావర్కర్లు, రూప, సత్యమ్మ, స్వప్న, ఏసులత, జలజ తదితరులు ఉన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

● ఎస్ఈ సుదర్శనం

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జగిత్యాల సర్కిల్ సూపరిండెంట్ ఇంజనీయర్ సుదర్శనం తెలిపారు. విగ్రహాల తయారీ కేంద్రాల నుంచి మండపాలకు గణేశ్ విగ్రహాలను తరలించే సమయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అయన అన్నారు. ఇప్పటికే విద్యుత్ శాఖ పలు ప్రాంతాల్లో తక్కువ ఎత్తులో ఉన్న తీగల సమస్యలను పరిష్కరించామన్నారు. ఇంకా సమస్యలు ఏమైనా మిగిలి ఉంటే తక్షణమే సంబంధిత అధికారులకు లేదా 1912 లేదా 8712486131 కు సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే తక్కువ ఎత్తులో ఇంటర్నెట్, కేబుల్ తీగలుకూడా విగ్రహాల రవాణాకు అడ్డంకిగా మారుతున్న నేపథ్యంలో సంబంధిత ఇంటర్నెట్, కేబుల్ ఆపరేటర్‌లు తొలగించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు విద్యుత్ స్తంభాలపై వాడుకలో లేని కేబుల్ తీగలను కూడా తక్షణమే తొలగించాలన్నారు. ఈ సూచనలను పరిగణలోకి తీసుకోనియెడల ప్రజల భద్రత దృష్ట్యా విద్యుత్ శాఖ స్వయంగా వాటిని తొలగించాల్సి ఉంటుందని ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

రోళ్లవాగు ప్రాజెక్టు షట్టర్ బిగించకపోవడంతో నీరు వృథా

● ఎమ్మెల్సీ ఎల్ రమణ

జగిత్యాల, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీర్‌పూర్ మండలంలో రోళ్లవాగు ప్రాజెక్టు పనులు 90శాతం పూర్తయినప్పటికీ షట్టర్ల బిగింపు జరగకపోవడంతో నీరు వృథా అవుతోందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత శాసన మండలి సమావేశంలో రోళ్లవాగు ప్రాజెక్టు షట్టర్ల బిగింపు అంశాన్ని ప్రస్తావించి ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ పనుల్లో నిర్లక్ష్యం చోటుచేసుకుం టోందని వివరించారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల రోళ్లవాగు నీరు రైతులకు ఉపయో గపడ డం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రోళ్లవాగు ప్రాజెక్టుకు షట్టర్లను బిగించి నీరు వృథా కాకుండా రైతన్నలను ఆదుకునే విదంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులకు అవగాహన సదస్సు

కొడిమ్యాల, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు వేదిక, మండలంలోని పూడూర్, తిర్మాలాపూర్ రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు పాత మామిడి తోటల పుర్జీవనంపై రైతులకు అవగాహన కలిపించారు. వాతావరణ బులిటెన్, డిజిటల్ వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలోజీ గురించి శాస్త్రవేత్తలు అవగాహన కలిపించారు. కొడిమ్యాల రైతు వేదికలో డీఏవో వి. భాస్కర్, పూడూర్ రైతు వేదికలో జిల్లా ఉద్యాన అధికారి శ్యాంప్రసాద్ పాల్గొన్నారు. రైతు నేస్తం కార్యక్రమాలలో ఏవో పి. జ్యోతి, మండల ఉద్యాన అధికారి స్వాతి, ఏఈవో గ్రీష్మ, హెచ్‌ఈవో అనిల్, పూడూర్ మాజీ సర్పంచు వి. రాంరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

'యూరియా కొరతకు కేంద్రానికే బాధ్యత'



బోర్నపెల్లి బ్రిడ్జి వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

రాయికల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్రానిదే బాధ్యత అని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో 8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి కావాల్సి ఉండగా, కేవలం 5లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి కావడం తో యూరియా కొరత ఏర్పడిందని, దీనిపై కేంద్రానికే బాధ్యతఅని ఆయన అన్నారు. బోర్నపెల్లి బ్రిడ్జి వద్ద గోదావరి నీటి ఉధృతి పెరుగడంతో గోదావరి తీర ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. అనంతరం రాయికల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బోర్నపెల్లి వంతెన నిర్మాణం చేపట్టాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకురాగా మంజూరు చేశారని, బోర్నపెల్లి, కమ్మునూరు బ్రిడ్జిల నిర్మాణం దగ్గరుండి పర్యవేక్షించానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

● అదనపు కలెక్టర్ బీఎస్ లత



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

కోరుట్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత ఆదేశించారు. తీవ్ర వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ లత వివిధ శాఖల అధికారులకు సూచించారు. మంగళవారం కోరుట్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై వివరాలను అడిగి తెనుకోని వాటి పరిస్థితులపై ఆరా తీసారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లత మాట్లాడారు. ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చెపట్టాలని సూచించారు. మిషన్ భగరథ నీరు అన్ని వార్డులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కోరుట్ల పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులో నెలకొన్న సమస్యను పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగిం చాలన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడు తూ ప్రజలకు అందుబాటులో ఉండి అధికారులు సేవలను అందించాలని అన్నారు. రానున్న వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కోరుట్ల, మెట్‌పల్లి మున్సి పల్ కమిషన్లు రవీందర్, మోహన్, విద్యుత్‌శాఖ డీఈ మదుసూదన్, ఏడీలు, అధికారులు పాల్గొన్నారు.

భార్యపై క్రికెట్ బ్యాట్‌తో దాడి

చందుర్తి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భార్యపై భర్త క్రికెట్ బ్యాట్‌తో దాడి చేసిన సంఘటన చందుర్తి మండలం రామరావుపల్లె గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. సంపత్ అనేవ్యక్తి కుటుంబ కలహాలతో భార్య లహరిపై క్రికెట్ బ్యాటుతో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై చందుర్తి ఎస్‌ఐ రమేష్ మాట్లాడుతూ తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గొల్లపల్లి గ్రామశివారులోని వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నల్లగొండ గ్రామంలో..

తిమ్మాపూర్: మండలంలోని రేణికుంట మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను నల్లగొండ గ్రామంలో మంగళవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. ట్రాక్టర్‌ను ఎల్ఎండీ పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు. కొత్తపల్లికి చెందిన చిట్యాల నరేష్‌తో పాటు కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కుర్ర లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మంథనిలో చోరీ

మంథని, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రావుల చెరువుకట్టలో రాంపెల్లి ఆనంద్ ఇంట్లో చోరీ జరిగినట్లు స్థానికులు సోమవారం రాత్రి గుర్తించారు. ఆనంద్ కొద్ది రోజులుగా వరంగల్ ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బెడ్‌రూం, బీరువాలో సామగ్రి చిందవందర చేశారు. ఇంట్లో ఏమేమి చోరీ జరిగిందో తెలియలేదు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పరిశీలించారు.

దుకాణంలో చోరీ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కాన్పూర ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి ఒక శానిటరీ షాపులో దొంగతనం జరిగింది. ఎండీ షకీల్ కాన్పూరలోని పెద్దపల్లి రోడ్‌లో షకీల్ శానిటరీ షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి షాపు తాళంవేసి ఎప్పటి మాదిరిగానే ఇంటికి వెళ్లాడు. మంగళవారం షకీల్ దుకాణం తెరిచేందుకు రాగా షటర్ తాళం పగులగొట్టి ఉంది. అనుమానంతో లోపలికి వెళ్లిచూడగా కౌంటర్‌లో డబ్బులు కనపడలేదు. కౌంటర్‌లో ఉన్న దాదాపు 20 వేల రూపాయలు గుర్తుతెలియని దొంగలు చోరీ చేశారని బాధితుడు షకీల్ కరీంనగర్ మూడో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పని బంగారం బతుకు నిస్సారం



- పెరుగుతున్న ధరలతో తగ్గిన పని
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న కార్పొరేట్ జ్యూవెల్లరీలు
- చితికిపోతున్న స్వర్ణకారుల జీవితాలు
- బతుకుదెరువు కోసం ఇతర రంగాల బాట

గణేశ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కులవృత్తులు రోజురోజుకూ ఉనికిని కోల్పోతున్నాయి. చేసేది లేక కొందరు బతుకు దారి మార్చుకుంటున్నారు. మరి కొందరు ఇప్పటికీ తాతల కాలం నుంచి వారసత్వంగా స్వీకరించి స్వర్ణకార వృత్తినే నమ్ముకుని అవస్థలు పడుతున్నారు. పని బంగారం.. కానీ బతుకు నిస్సారంగా మారిందని స్వర్ణకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంట్లో శుభకార్యం తలపెడితే ముందుగా గుర్తుకు వచ్చేది బంగారం దుకాణమే. వివాహవేడుకలకు బంగారానికి ఎంతో ప్రాముఖ్యం ఉన్నది. మహిళలు అందంగా, హుందాగా కనిపించాలని బంగారు ఆభరణాలు ధరిస్తారు. బంగారు ఆభరణాలు తయారు చేయాలంటే దాని వెనుక పెద్ద కష్టమే ఉంటుంది.

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సుమారు 10 నుంచి 20 వేలకు పైగా స్వర్ణకార కుటుంబాలు ఉన్నాయి. బంగారం ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేయడం లేదు. దీంతో స్వర్ణకారులు పని దొరకక దుకాణాల అద్దెలు కూడా చెల్లించలేక పోతున్నారు. కుటుంబ పోషణ భారమై ఇతర రంగాల్లో పని చేస్తున్నారు. మరో వైపు ఆభరణాల రంగంలో కార్పొరేట్ జ్యూవెల్లరీ షాపులు పెద్ద ఎత్తున వెలవడంతో పాటు వాయిదాల పద్ధతిలో బంగారు ఆభరణాలు విక్రయిస్తుండడంతో వినియోగదారులు కార్పొరేట్ జ్యూవెల్లరీ షాపుల్లో కొనుగోలు చేసేందుకే మొగ్గు చూపుతు న్నారు. కార్పొరేట్ వ్యవస్థ కారణంగా స్వర్ణకారులు వృత్తి పనులు కోల్పోతున్నారు.

కూలీలుగా మారుతున్న స్వర్ణకారులు

పెరుగుతున్న బంగారం, వెండి ధరల కారణంగా, సర్వం యంత్రాలమయం కావడంతో స్వర్ణకారులకు చేతినిండా పని లేకుండా పోయింది. దీంతో కొందరు పెట్టుబడులు పెట్టి వ్యాపారాలు చేయలేక బ్యాంకుల్లో అప్రయిజర్లుగా చేరిపోయారు. బతుకు బండిని లాగేందుకు కార్పొరేట్ జ్యూవెల్లరీ షాపుల్లో గుమస్తాలుగా చేరుతున్నారు. మరికొంతమంది భవన నిర్మాణ కార్మిక రంగంలో కూలీలుగా మారి దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఇంకొంత మంది ఇడ్లీ, టీ బండ్లను నడుపుకుంటున్నారు. ఇక ఇతర వృత్తుల్లోకి వెళ్లడం ఇష్టంలేని మరికొంత మంది స్వర్ణకారులు రాగి, ఇత్తడి, పంచలోహ తాయిత్తులు, ఇతర చిన్న చిన్న వస్తువులను తయారు చేస్తూ వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం స్వర్ణకార వృత్తి చేస్తున్న వారెవరూ కూడా వారి పిల్లలకు ఈ వృత్తిని నేర్పించడానికి ఇష్టపడటం లేదు. ప్రభుత్వం ఇతర చేతి వృత్తుల వారికి ఇచ్చిన మాదిరిగా ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.



ప్రభుత్వం ఆదుకోవాలి

కట్ల జగన్, జిల్లా స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి



ధరల హెచ్చుతగ్గులు, కార్పొరేట్ జ్యూవెల్లరీ దుకాణాలతో వృత్తిని నమ్ముకున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థికంగా ఉన్న వారికి కొంతమేరకు వ్యాపారాలు నడుస్తున్నాయి. ఆర్థికంగా లేని స్వర్ణకారులు కార్పొరేట్ జ్యూవెల్లరీ షాపుల్లో గుమస్తాలుగా చేరుతున్నారు. మరికొంత మంది వెల్డింగ్ షాపుల్లో, భవన నిర్మాణ రంగంలో కూలీలుగా మారారు. ప్రభుత్వాలు స్పందించి వడ్డీ లేకుండా రూ.10లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలి.

చేతినిండా పనిలేకుండా పోయింది

శ్రీరామోజు రవీంద్రాచారి, స్వర్ణకారుడు



పండుగలతో పాటు వివాహాది శుభ ముహూర్తాలు ఉంటే చేతి నిండా పని ఉండేది. మార్కెట్లోకి కార్పొరేట్ జ్యువెలర్స్ రావడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కనీసం చిన్న చిన్న పనులు కూడా రావడం లేదు. ప్రభుత్వం గుర్తించి నిరుపేద స్వర్ణకారులను ఆదుకోవాలి. ఆర్థిక ఇబ్బందులతో స్వర్ణకారులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు వస్తున్నాయి.

ఇతర పనులు చేస్తున్నాం..

కనపర్తి సత్యనారాయణ, స్వర్ణకారుడు



బంగారం ధరలు విపరీతంగా పెరగడం, మార్కెట్లో కార్పొరేట్ జ్యూవెలరీ షాపులు విరివిగా వెలుస్తుండ డంతో బంగారం, వెండి పనిచేసేవారికి చేతి నిండా పనిలేకుండా పోయింది. కొన్ని దుకాణాల్లో వాయిదాల పద్ధతిన ఆభరణాలు విక్రయిస్తున్నందున వినియోగ దారులు అటువైపే వెళ్తున్నా రు. పెట్టుబడులు పెట్టి వ్యాపారాలు చేయలేక, ఇతర రంగంలో పనులు చేయడం ఇష్టంలేక, పంచలోహ ఉంగరాలు చేస్తూ కుటుంబాలు వెళ్లదీసుకుంటున్నారు.

ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

- ప్రైవేటు బస్సు, ట్రాక్టర్ ట్రాలీ సీజ్
- రూ.4 లక్షల జరిమానా

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని సిరిసిల్ల ఇన్‌చార్జి డీటీవో వంశీధర్ హెచ్చరించారు. వీర్నపల్లి మండల కేంద్రం పరిధిలోని ప్రధాన రహదారిపై మంగళవారం వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. వాహనాలను ఆపి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. సామర్థ్యానికి మించి ప్రయాణీకులను తరలిస్తున్న ఆటోవాలలపై కొరడా ఝుళిపించారు. వాహన పన్ను చెల్లింపునకు నెల రోజులు గడువు ఇచ్చినా డబ్బులు కట్టని వాహనదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడపకూడదని పేర్కొన్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా ప్రయాణీస్తున్న సిద్దిపేట జిల్లాకు చెందిన ఓ ప్రైవేటు బస్సు, ట్రాక్టర్ ట్రాలీని సీజ్‌చేసి రూ.4లక్షల జరిమానా విధించామని ఇన్‌చార్జి డీటీవో వంశీధర్ పేర్కొన్నారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.



పత్రాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీటీవో వంశీధర్

సహకార బ్యాంక్‌లో మోగిన సైరన్

- అప్రమత్తమైన పోలీసులు

సుల్తానాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో పోలీస్ స్టేషన్ వెనుక సహకారబ్యాంక్ ఉంది. మంగళవారం తెల్లవారుఝామున ఒక్కసారిగా బ్యాంక్ నుంచి హారన్ వినిపించింది. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందారు. సైరన్ అలా ఆగకుండా మోగుతూనే ఉండడం, బ్యాంకు షట్టర్లు తెరిచి ఉండడంతో అయోమయానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు బ్యాంక్ వద్దకు చేరుకున్నారు. బ్యాంకు మేనేజర్ శశికాంత్‌ను వివరణ అడుగగా తెల్లవారుఝామున బ్యాంకును శుభ్రం చేసేందుకు వచ్చిన వ్యక్తి ఆటోమోటిక్ ఆలారం సైరన్ సిస్టమ్‌ను అన్‌లాక్ చేయక షట్టర్లు తీసి లోపలకు రావడంతో ఆటోమేటిక్ సైరన్ మోగిందన్నారు. కొంత సేపటి తర్వాత ఫోన్ ద్వారా సైరన్‌ను అన్‌లాక్ చేయడంతో హారన్ ఆగిపోయిందన్నారు.

వినాయకుడి విగ్రహాన్ని తీసుకువస్తుండగా విషాదం..
విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



లక్ష్మీనారాయణ(ఫైల్)

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గణపతి విగ్రహాన్ని తీసుకు వస్తుండగా విద్యుదాఘాతంతో కొమ్ము లక్ష్మీనారాయణ (19) అనేయువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరొక యువకుడు సాయికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన వీఐపీయూత్ ఆధ్వర్యంలో 12మంది యువకులు గణపతి విగ్రహాన్ని తీసుకువచ్చేందుకు ఆదివారం నిజామా బాద్ జిల్లా పెర్కిట్‌కు వెళ్లారు. పెర్కిట్ నుంచి 20అడుగుల గణేష్ విగ్రహాన్ని వాహనంపై తీసుకు వస్తుండగా మంగళవారం ఉదయం కామారెడ్డి జిల్లాలోని ఆరెపల్లి శివారులో 11కేవీ విద్యుత్‌వైరు తగిలి లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. తంగళ్లపల్లి మండలం ఓబుళాపూర్ గ్రామానికి చెందిన కొమ్ము నవీన-మైసయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఒకకూతురు ఉన్నారు. వీరు ఉపాధికోసం సిరిసిల్లకు వలసవచ్చారు. పెద్దకొడుకు లక్ష్మీనారాయణ మృతితో కుటుంబంలో విషాదం అలుముకుంది. మరోయువకుడు సాయికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు లక్ష్మీనారాయణకు సీపీఆర్ చేసినా ప్రాణాలు దక్క లేదు. లక్ష్మీనారాయణ సాయంత్రం పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటామని స్నేహితులకు చెప్పుకుంటూ ఇంటికి వస్తుండగా విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రగాయాలైన సాయికి స్థానికులు సీపీఆర్ చేసి కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. మిగతా 10మంది యువకులు వాహనంపై ముందు ఉండటంతో భారీప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆసుపత్రికి తరలివెళ్లారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య



లక్ష్మణ్(ఫైల్)

ఓదెల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంపులలో మంగళ వారం ఊరగొండ లక్ష్మణ్(42) అనేవ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. లక్ష్మణ్ భార్య విడాకులు తీసుకొని పుట్టింటికి వెళ్లడంతో అతడు అప్పటినుంచి మద్యానికి బానిసయ్యాడు. ఆరేళ్ల క్రితం హైదరాబాద్‌లో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో తలకు తీవ్రగాయాలై చికిత్సపొందాడు. ఆరోగ్యం కుదుటపడడంతో పొత్కపల్లిలోని పెట్రోల్‌బంక్‌లో పనిచేస్తున్నాడు. అయితే మద్యానికి బానిస కావడంతో తల్లి మందలించింది. దీంతో జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ నోట్‌రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఊరగొండ మధునమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్‌ఐ దీకొండ రమేష్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తు తెలియని ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ కూరగాయల మార్కెట్, వెంకటేశ్వర టెంపుల్ సమీపంలో మంగళవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి(50) పడుకొని వర్షంలో తడుస్తూ వణుకుతూ స్థానికులకు కనిపించాడు. ఉదయం 9:30గంటలకు డయల్ 100ద్వారా సమాచారం తెలుసుకున్న కరీంనగర్ ఒకటోటౌన్ పోలీసులు సదరు వ్యక్తిని అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అక్కడచికిత్సపొందుతూ ఉదయం 10:30గంటలకు మృతి చెందాడు. మృతుడు ఎరుపు, నల్లనిగీతలు కలిగిన టీషర్టు, నలుపు రంగు పాయింటు ధరించిఉన్నాడని మృతదేహాన్ని ప్రభుత్వఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడిని గుర్తించినా, ఆచూకీ తెలిసిన వారు వెంటనే కరీంనగర్ ఒకటో టౌన్‌లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ఒడ్డెపల్లి క్రాసింగ్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మందమర్రి మండలం క్యాతన్‌పల్లికి చెందిన వృద్ధురాలు జడ బక్కవ్వ(80) మృతి చెందిందని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. బక్కవ్వతోపాటు ఆమె మనమరాలు మౌనిక మంగళవారం కరీంనగర్‌కు వచ్చి ఒక ఆటోలో బావుపేటకు వెలుతున్నారు. ఈ క్రమంలో ఒడ్డెపల్లి క్రాసింగ్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న బక్కవ్వతోపాటు మౌనిక, ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గాయపడినవారిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా బక్కవ్వ మార్గమధ్యలో మరణించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

ఈత, తాటి చెట్ల ధ్వంసంపై ఎక్సైజ్ అధికారుల పరిశీలన

సుల్తానాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరుకుళ్ల గ్రామంలోని మానేరు వాగు సమీపంలో ఉన్న తాటి, ఈత వనాన్ని కొందరు ధ్వంసం చేశారంటూ గౌడసంఘం నేతల ఫిర్యాదు మేరకు మంగళవారం సుల్తానాబాద్ ఎక్సైజ్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గీత కార్మికులు మాట్లాడుతూ భూమి యజమానులు కొందరు భూములను చదును చేసే క్రమంలో తమకు ఉపాధినిచ్చే తాటి, ఈత చెట్లను కూడా ధ్వంసం చేశారని అధికారులకు వివరించారు. పూర్తి వివరాలు నమోదు చేసుకున్న ఎక్సైజ్ అధికారులు విచారణ చేపట్టారు.

జగిత్యాలలో విషాదం

- మహారాష్ట్ర వరదలో గల్లంతైన ఇద్దరు మహిళల మృతదేహాలు లభ్యం



హసీనా(ఫైల్)



సమీనా(ఫైల్)

జగిత్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో వరదఉధృతికి కొట్టుకుపోయిన ఇద్దరు మహిళల మృతదేహాలు మంగళవారం లభ్యమవడంతో వారి స్వస్థలమైన జగిత్యాల జిల్లా కేంద్రంలో విషాదం నెలకొంది. నాందేడ్ జిల్లా దెగ్లూర్ సమీపంలోని రావి గ్రామంవద్ద వరదఉధృతికి ఆదివారం జగిత్యాలకు చెందిన ముగ్గురు మహిళలు గల్లంతు కాగా వారిలో మంగళవారం హసీనా(36), సమీనా(50) అనే మహిళల మృతదేహాలు లభ్యమయ్యాయి. జిల్లాకేంద్రంలోని తారకరామనగర్ కాలనీకి చెందిన ముగ్గురు మహిళలు వారి బంధువైన షోయబ్‌తోకలిసి మహారాష్ట్రలోని ఉద్గీర్‌లో ఓ శుభకార్యానికి వెళ్లారు. అనంతరం తిరుగుప్రయాణంలో వారు ప్రయాణిస్తున్న కారు వరదల్లో గల్లంతు కాగా స్థానికులతోపాటు బాధిత కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం వరద ఉధృతి తగ్గడంతో రావి గ్రామంవద్ద గల్లంతైన కారు 24కిలోమీటర్ల దూరంలోని ముక్రంబాద్ అనే గ్రామం సమీపంలోని బ్రిడ్జికింద పంటపొలాల్లోని బురదలో చిక్కుకున్నట్లు గుర్తించారు. మరికొంత దూరంలో చెట్లపొదల మధ్య హసీనా, సమీనాల మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన మరో మహిళ ఆఫ్రీన్‌కు చెందిన చీరతో పాటు బురఖా కారు వద్ద లభ్యమయ్యాయి.

త్రుటిలో తప్పించుకున్నా..

- ప్రమాదం నుంచి బయటపడిన ప్రత్యక్ష సాక్షి షోయబ్



షోయబ్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వరదలో కారుతోసహా కొట్టుకుపోగా ఆటోడ్రైవర్, కారు డ్రైవర్‌తోపాటు తాను త్రుటిలో తప్పించుకున్నానని ప్రమాదంనుంచి బయటపడిన ప్రత్యక్ష సాక్షి షోయబ్ తెలిపాడు. మహారాష్ట్రలో వరదలో కొట్టుకుపోయిన మహిళల మృతదేహాల కోసం వెతుకుతున్న తారకరామనగర్ వాసులతో ఉన్న షోయబ్‌ను ఫోన్‌లో పలకరించగా ఆదివారం రాత్రి జరిగిన సంఘటనను వివరించాడు. ఆదివారం అర్ధరాత్రి తనబంధువులైన హసీనా, ఆఫ్రిన్, సమీనాలతో కలిసి ఆటోలో ఉద్గిర్ నుంచి బయలుదేరామని తెలిపాడు. ఉద్గీర్‌నుంచి ఆటోలో కొంతదూరం వచ్చాక ముక్తేడ్ తాలూకా దెగ్లూర్‌కు కొంచెందూరంలో మేమువెళ్తున్న రోడ్డుపై నీరు ప్రవహించడం ఆటో డ్రైవర్ గమనించాడన్నాడు. దీంతో వెంటనే డ్రైవర్ ఆటోను వెనక్కుతిప్పే ప్రయత్నం చేశాడని తెలిపాడు. అప్పటికే వెనుకవైపు కూడా నీరుచేరడంతో ఆటో నీటిని దాటివెళ్లలేక పోయిందన్నారు. దీంతో మా ముందున్న కారులో హసీనా,ఆఫ్రిన్,సమీనాతోపాటు ఆటోడ్రైవర్, కారుడ్రైవర్ కూర్చున్నామన్నారు. కొద్దిసేపటికే కారులోకి నీరురావడంతో కాపాడాల్సిందిగా కేకలు వేశామన్నారు. అర్ధరాత్రికావడంతో ఎవరూ ఆ పరిసరాల్లో కనిపించలేదన్నారు. అయితే తాము కొట్టుకుపోవడం ఖాయమని తెలియగానే ఆఫ్రిన్ ఇంటికి ఫోన్‌చేసి తమ పరిస్థితిని వివరించిందన్నారు. అదే సమయంలో కారుతోసహా తాము నీటిలో కొట్టుకు పోయామని షోయబ్ తెలిపాడు. ఆటోడ్రైవర్, కారు డ్రైవర్‌తోపాటు తానుకొంచెం దూరంలో చెట్టును పట్టుకొని బయటపడ్డామని షోయబ్ పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

గంగాధర, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గంగాధర పోలీసులు ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఈనెల16న గంగాధర గ్రామానికి చెందిన పెగుడ మల్లమ్మ(70)ను గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి వచ్చి నంబరులేని కారులో ఎక్కించుకుని వెళ్లారు. మల్లమ్మ ఆచూకీ లభించక పోవడంతో మరుసటి రోజు ఆమె తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమీపంలోని సీసీ పుటేజీలను పరిశీలించిన పోలీసులు వృద్ధురాలు కారులో ఎక్కిన దృష్యాలను గుర్తించారు. కానీ అగంతకులు వృద్ధురాలిని నంబరు ప్లేటు తొలగించిన కారులో తీసు కెళ్లగా పోలీసులకు నిందితులను పట్టుకో వడం సవాలుగా మారింది. అయితే మంగ ళవారం విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఇద్దరు అనుమానితులను అదు పులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమా చారం. కారులో తీసుకెళ్లిన వృద్ధురాలి ఆచూకీ మాత్రం ఇప్పటికీ లభించలేదు. వృద్ధురాలిని తెలిసిన వ్యక్తులే తీసుకెళ్లారని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తు న్నారు.

వర్షానికి రహదారిపై నేలకొరిగిన భారీ వృక్షం

జగిత్యాలరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామశివారులోని నిజామాబాద్ రహదారిపై వర్షానికి భారీ వృక్షం నేలకొరిగింది. చెట్టు రోడ్డుకి అడ్డంగా పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తమ సిబ్బందితో కలిసి ఎక్స్‌కవేటర్‌తో వృక్షాన్ని పక్కకు తొలగించారు. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు.



వృక్షాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న ఎస్సై సధాకర్

విజిలెన్స్ విచారణపై ఆసక్తి

- మిడ్ మానేరు ప్రాజెక్టులో రూ.224 కోట్ల అక్రమాలపై చర్చ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

శ్రీరాజరాజేశ్వర మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణ పనులు తొలినాళ్ల నుంచి అనేక అవాంతరాలు, అవినీతి ఆరోపణల మధ్య కొనసాగాయి. మిడ్ మానేరు ప్రాజెక్టు అవినీతి, అక్రమాలపై నిలబడిందనే చర్చలకు మరోసారి ఊతమిస్తూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ నిలిచింది. తాజాగా మిడ్ మానేరు ప్రాజెక్టుపనుల్లో ప్రభుత్వ ఖజానాకు రూ.224కోట్ల మేరకు నష్టం తెచ్చిన అప్పటి ఇంజనీర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తన నివేదికను నీటిపారుదల శాఖకు అందజేసినట్లు తెలియడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో చర్చ ప్రజల్లో మొదలైంది.

సీనియర్ ఇంజనీర్ల నుంచి కిందిస్థాయివరకు చర్యలు తీసుకోబోతున్నారా.. విచారణతో కాలయాపన జరుగుతుందా..?, అలాగే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డలో ఏర్పడ్డ లోపాలతో అప్పటి ప్రభుత్వ పెద్దలకు మిడ్‌మానేరు అవినీతి ఉచ్చు చుట్టుకుంటుందా.. అనే గుబులు మొదలైంది. విజిలెన్స్ అధికారులు పక్కాగా ఆధారాలు సేకరించారు. అందులో అధికారులపైన క్రిమినల్‌చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఒకరిద్దరు అధికారులు ఇప్పటికే రిటైర్ అయ్యారు.. అయినా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిందని ప్రభుత్వా నికి సిఫారసు చేయడం అధికారుల్లో ఆందోళన మొదలైంది.

- 2006లో మిడ్ మానేరు ప్రాజెక్టుకు గండి..

రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడవద్ద మానేరు వాగుపై మిడ్‌మానేరు పాజెక్టు 2006లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మాణం చేపట్టింది. రూ.399కోట్లతో జడ్వీఎస్, రత్న, సుశీ జాయింట్ వెంచర్‌దక్కించుకుంది. నిర్ణీత సమయాన్ని దాటి గడువు పొడిగించినప్పటికీ.. పనులను పూర్తి చేయలేకపోవడంతో 2012లో మరోకంపెనీలకు నిర్మాణ బాధ్యతలను అప్పగించింది. జాయింట్ వెంచర్‌గా పనులు దక్కించుకున్న 2015నాటికి అనుకున్నంత స్థాయిలో పనులు కాలేదు. అప్పటికే తెలంగాణలో బీఆర్ఎస్ సర్కారు ఏర్పడడం, ప్రాజెక్టులపై అప్పటి సీఎం కేసీఆర్ సుదీర్ఘ సమీక్షల తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ముందుకు తెచ్చారు. మిడ్‌మానేరు రిజర్వాయర్‌ను వాటర్ హబ్‌గా కాళేశ్వరం ప్రాజెక్టులో అతికీలకమైనది ఉపయోగపడేలా డిజైన్ చేశారు. ఇక్కడినుంచే లోయర్ మానేరు డ్యాంకు, రంగనాయక సాగర్ , మల్లన్న సాగర్‌కు, కొండపోచమ్మ సాగర్‌కు నీటిని తరలించే విధంగా ప్యాకేజీలను రూపొందించారు. 2016లో వేగంగా మిడ్‌మానేరు పనులు పూర్తి చేసి కొంత మేరకు నీటిని నిల్వ ఉంచారు. అదే సమయంలో సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వరదలకు విడమ వైపు కట్టకు గండి పడింది. ఐదు లక్షల క్యూసెక్కులను తట్టుకునేలా నిర్మించిన డ్యాం.. లక్ష క్యూసెక్కులకే కట్టతెగడంతో.. ప్రభుత్వంపై రూ.30 కోట్ల అదనపు భారం పడింది. కుడివైపు స్పిల్‌వే, మట్టికట్ట పని పుణేకు చెందిన యశోదీప్ ఇన్‌ఫ్రాకు అప్పగించారు. ఆ సంస్థ రూ.13 కోట్ల పనులు చేసిన తర్వాత చేతులెత్తేసింది. దీంతో శ్రీరాజరాజేశ్వరి కన్‌స్ట్రక్షన్ కంపెనీకి రూ.101 కోట్ల పనులను అప్పగించారు. కొత్త కంపెనీలకు పనులను అప్పగించే సమయంలో నిబంధనలను సడలించి.. ధరలను పెంచారు. మరోవైపు కొత్త ధరలను తమకూ వర్తింపజేయాలని జాయింట్ వెంచర్‌లోని మిగతా కంపెనీలు కోరగా.. అందుకు స్టాండింగ్ కమిటీ ఒప్పుకోలేదు. ఇదే సమయంలో ఎడమవైపు మట్టి కట్ట 130 మీటర్ల గండి పడింది. దీంతో అప్పటికే పనులు చేస్తున్న సంస్థను తొలగించి.. ఎడమవైపు పనులకు రూ.347 కోట్లుగా నిర్ధారించి.. పరిపాలన అనుమతులు లేకుండానే టెండర్ పిలిచి.. రాజరాజేశ్వరీ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఇచ్చారు. అంచనాలను భారీగా పెంచడంతో ప్రభుత్వానికి రూ 224 కోట్ల నష్టం వాటిల్లింది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆ ప్రాజెక్టు మీద అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. అయినా ఆ ఆరోపణలను బీఆర్ఎస్ పట్టించుకోలేదు. 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం రేవంత్‌రెడ్డిని, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి మిడ్ మానేరు ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని ముంపు గ్రామాల అధ్యక్షుడు కూస రవీందర్ ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. దీంతో ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. సంవత్సర కాలంగా అధికారులు విచారణ జరిపి.. నివేదిక అందించారు.




మిడ్ మానేర్ ప్రాజెక్ట్


పరవళ్లు తొక్కుతున్న ఎగువ మానేరు ప్రాజెక్టు

ఎగువ మానేరు పరవళ్లు

అప్రమత్తమైన అధికారులు

గంభీరావుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయం పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సిద్దిపేట జిల్లాలోని కూడవెళ్లి వాగు, కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో నర్మాల ఎగువ మానేరు పూర్తిగా నిండి మత్తడి దూకుతోంది. మొత్తం మానేరు నీటి మట్టం 31 ఫీట్లు ఉండగా, మంగళవారం ఉదయంకల్లా 31 ఫీట్లకు చేరి, మత్తడి దూకుడు మొదలైంది. మానేరు మత్తడి దూకి పరవళ్లు తొక్కుతుండటంతో ఈ ప్రాంత ప్రజల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. మంగళవారం ఉదయం నుంచి మానేరు మత్తడి దూకుతుండటంతో తహసీల్దార్ మారుతిరెడ్డి సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు మానేరు డ్యాంతో పాటు మానేరు వాగు పరిసరాలను పర్యవేక్షిస్తున్నారు.


శ్రీరాంసాగర్ వద్ద..

శ్రీరాంసాగర్‌కు భారీగా వరద

39 గేట్లు ఎత్తి 3,25,000 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

జగిత్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద నీరు భారీగా వస్తోంది. దీంతో ప్రాజెక్టుకు చెందిన 39 వరద గేట్లు పైకి ఎత్తి 3,25,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఎస్సారెస్పీలోకి 2,75,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తుతం 73.37 టీఎంసీల నీరు ఉంది. వరద కాలువకు 20,000 క్యూ సెక్కులు, కాకతీయ కాలువకు 4,700 క్యూ సెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 636 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 82.683 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 22.026 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.


నిండుగా ప్రవహిస్తున్న వరద కాలువ

గాయత్రి పంప్‌హౌస్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రామడుగు మండలం గాయత్రి లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతుంది. ఇంతవరకు మూడు, నాలుగు పంపుల ద్వారా మిడ్ మానేరుకు నీటిని తరలిస్తున్న అధికారులు ప్రస్తుతం ఎస్సారెస్పీ నీరు వస్తున్న నేపథ్యంలో ఒక్క పంపునకు కుదించారు. రెండు పంపుల ద్వారా 3150క్యూసెక్కుల నీరు పంప్ హౌస్ నుంచి వరద కాలువకు తరలి వెళ్తోంది. అలాగే ఎస్సారెస్పీ నుంచి 15450క్యూసెక్కులు నీరు వరద కాలువలో చేరుతోంది. దీంతో ప్రస్తుతం వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు 18 500క్యూసెక్కుల నీరు తరలి వెళుతోంది. ప్రస్తుతం ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ నుంచి వరద కాలువకు నీటి ప్రవాహం పెరుగుతుండగా రేపటిలోగా ఇక్కడికి నీరు వచ్చే అవకాశం ఉండటంతో పంపులను ఆపివేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు నీరు తరలి వెళుతుండటంతో వరద కాలువ నిండు కుండలా తయారైంది.


అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి వెళుతున్న నీరు

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు ప్రారంభం

ఇల్లంతకుంట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు మంగళవారం ప్రారంభమయ్యాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 1.08టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వచ్చిన 3200క్యూసెక్కుల నీటిని నాలుగో నంబర్ పంపు ద్వారా ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి ఎగువన ఉన్న ప్యాకేజీ 11లోని రంగనాయకసాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ప్రతాపరెడ్డి తెలిపారు.

తెగిన లింగన్నపేట రోడ్డు


వరద ఉధృతికి తెగిన రోడ్డు

గంభీరావుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట-లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై ఉన్న రోడ్డు మంగళవారం సాయంత్రం తెగిపోయింది. విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు పూర్తిగా నిండి, మత్తడి దూకుతోంది. దీంతో మానేరు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో లింగన్నపేట రోడ్డు తెగింది. వరద ఉధృతితో మానేరు వాగుపై ఉన్న రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎస్ఐ రమాకాంత్ మానేరు పరివాహక ప్రాంతాల పరిస్థితిని పరిశీలించి, ప్రజలను అప్రమత్తం చేశారు. మానేరు డ్యాం, మానేరు వాగు ప్రాంతాల దగ్గర రెండు వైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆ మార్గాల వైపు వాహనాలు, ప్రజలు వెళ్లకుండా చర్యలను చేపట్టారు.

పంచేంద్రియాలకు శిక్షణ

- కస్తూర్బాల్లో 'బ్రైటర్ మైండ్స్' ట్రైనింగ్‌తో అద్భుత ఫలితాలు
- కళ్లకు గంతలు కట్టుకొని రంగులు, చిత్రాలు గుర్తింపు
- అబ్బురపరుస్తున్న విద్యార్థులు


కళ్లకు గంతలు కట్టుకుని రంగులను గుర్తిస్తున్న విద్యార్థినిని అభినందిస్తున్న జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ (ఫైల్)

సారంగాపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బ్రైటర్ మైండ్స్ పేరుతో కస్తుర్బా విద్యాలయాల్లో పంచేంద్రియాలకు శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరుస్తున్నారు. జగిత్యాల, సారంగాపూర్‌లోని కస్తూర్బా విద్యాలయాల్లో ప్రత్యేక శిక్షణతో విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకొని తమ ముందున్న రంగులను, అక్షరాలను, చిత్రాలను, వ్యక్తులను తేలికగా గుర్తిస్తున్నారు. ఇటీవల సారంగాపూర్ కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులు తమ ప్రతిభను ప్రదర్శించి కలెక్టర్ సత్యప్రసాద్‌తో శభాష్ అనిపించుకున్నారు. సారంగాపూర్‌లో గత ఏడాది మార్చి నుంచి విద్యార్థులకు శిక్షణను ప్రారంభించారు.

ఉపాధ్యాయులకు హైదరాబాద్‌లో శిక్షణ

హైదరాబాద్‌లోని శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో కన్హాశాంతి వనం ధ్యానం కేంద్ర నిర్వాహకులు జగిత్యాల, సారంగాపూర్ కస్తూర్బా విద్యాలయం నుంచి ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులను బ్రైటర్ మైండ్స్ శిక్షణకు ఎంపిక చేశారు. వీరికి రెండు రోజులు పాటు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. జగిత్యాలకు చెందిన స్వచ్ఛంద సేవకులు మంచాల రామకృష్ణ ఈ శిక్షణకు సంబంధించిన పరికరాలను బహూకరించారు. కస్తూర్బాలో ప్రతి బ్యాచ్‌కు 15 నుంచి 20 మంది విద్యార్థు లు ఈ బ్రైటర్ మైండ్స్ శిక్షణ తీసుకుంటున్నారు. ఎంపిక చేసిన విద్యార్థులకు తొమ్మిది వారాల పాటు శిక్షణ ఇస్తారు.

మెదడుకు ఉత్తేజం

విద్యార్థులకు మోటివేషన్, ప్రసంగం, రిలాక్సేషన్, ప్రాణయామం, ధ్యానం, మెదడు, కళ్లు, వంటి వాటిపై శిక్షణ ఇస్తూ మరో 40 నిమిషాలు సంగీతాన్ని వినిపిస్తూ పడుకోబెడతారు. లేచిన అనంతరం కళ్లకు గంతలు కట్టుకుని శబ్దం, వాసన, స్పర్శ, దృష్టి ద్వారా రంగులను, వస్తువులను, వ్యక్తులను ఎలా గుర్తు పట్టాలో శిక్షణ ఇస్తారు. బ్రైటర్ మైండ్స్ శిక్షణలో ప్రధానంగా మెదడుకు సంబంధించిన వ్యాయామాలు నేర్పించడం ద్వారా పంచేంద్రియాలు చురుగ్గా పనిచేసేలా తర్ఫీదునిస్తారు. దీంతో పంచేంద్రియాలైన కళ్లు, చెవులు, ముక్కు, నాలుక, చర్మం ఉత్తేజం చెంది బాగా పనిచేస్తాయి. తద్వారా రంగులను, వాసనను, వ్యక్తులను, చిత్రాలను, అక్షరాలను తేలిగ్గా గుర్తించగల్గుతారు.

విద్యార్థుల భవిష్యత్తుకు దోహదం

వీణ, కస్తూర్బా విద్యాలయ ప్రత్యేకాధికారి, సారంగాపూర్



ఈ బ్రైటర్ మైండ్స్ శిక్షణ విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడుతుంది. శిక్షణతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరిగింది. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను త్వరగా నేర్చు కుంటున్నారు. ఈ శిక్షణ ఎంతగానో విద్యార్థులకు దోహదపడుతుంది.

తొమ్మిది వారాలు శిక్షణ

రజిత, బ్రైటర్ మైండ్స్ శిక్షణ ఉపాధ్యాయురాలు



మెదడుకు సంబంధించిన వ్యాయామం ద్వారానే రంగులను, బొమ్మలను, వ్యక్తులను గుర్తించడం సాధ్యమవుతుంది. మేము హైదరాబాద్‌లో రెండు రోజులు శిక్షణ తీసుకొని మా విద్యార్థులకు బ్యాచ్‌ల వారీగా తొమ్మిది వారాల పాటు శిక్షణ ఇస్తున్నాం. కొంత మంది విద్యార్థులు రెండు వారాల శిక్షణలోనే నేర్చుకోగలుగుతున్నారు.

ఏకాగ్రత పెరిగింది

వైష్ణవి, 9వ తరగతి



బ్రైటర్ మైండ్స్ శిక్షణ తీసుకున్న తర్వాత నాలో ఏకాగ్రత పెరిగింది. అప్పటి నుంచి మెదడు మరింత చురుగ్గా పనిచేస్తోంది. ఈ శిక్షణ భవిష్యత్తులో ఉన్నత చదువులకు ఎంతగానో ఉపయోగ పడుతుంది.


ఎల్లంపల్లి గేట్లు ఎత్తడంతో దిగువకు పరుగులు తీస్తున్న నీరు

సుందిళ్ల బ్యారేజీలోకి చేరుతున్న నీరు

మంథనిరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా, పై నుంచి భారీ వరద నీరు రావడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో మంగళవారం గేట్లు ఎత్తి వేయడంతో సుందిళ్ల బ్యారేజీలోకి 2లక్షల 63 వేల 898 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. అయితే బ్యారేజీలో ఉన్న 74గేట్లు ఎత్తి ఉండటంతో నీరు దిగువ ప్రాంతానికి వదిలి వేశారు. దీంతో గోదావరిలో నీటి మట్టం ఒక్కసారిగా పెరిగింది. మరో వైపు మానేరు నదిలో నీటి ప్రవహం పెరిగింది. గోదావరి, మానేరు నదుల నుంచి నీరు దిగువ ప్రాంతానికి భారీ ఎత్తున వెళ్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

శ్రీపాద ఎల్లంపల్లికి భారీగా వరద..

శ్రీపాద ఎల్లంపల్లికి ఎగువ ప్రాంతం నుంచి 3,67,461 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, దిగువకు 40 గేట్ల ద్వారా 4 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. నంది పంప్‌హౌస్‌కు 3,150 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతుండగా, అక్కడి నుంచి మిడ్ మానేరుకు 6,300 క్యూసెక్కులను 2 పంపుల ద్వారా నీటిని తరలిస్తున్నారు. వరద ప్రవాహం పెరుగుతుండడంతో గోదావరి తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ఎల్లంపల్లి బ్యారేజీ వద్దకు వెళ్లి వరద పరిస్థితిని పరిశీలించారు. ఈ బ్యారేజీ మీదుగా మంచిర్యాల జిల్లాకు సాగే రాకపోకలను నిలిపి వేస్తున్నట్లు నీటి పారుదల శాఖాధికారులు ప్రకటించారు.

ఎత్తిపోతలకు కుదింపు...

బోయినపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఒకే పంపు ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎస్సారెస్పీ నిండుకుండలా మారడంతో అక్కడి నుంచి 20వేల క్యూసెక్కుల నీటిని వదులుతుండడంతో వరద కాలువ ఎస్సారెస్పీ నీటితో పరుగులు పెడుతోంది. శ్రీరాజరాజేశ్వర జలాశయానికి గాయత్రి పంప్ హౌస్ ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం వరకు 17600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. గాయత్రి పంప్ హౌస్ నుంచి 4600 వేలు, ఎస్సారెస్పీ నుంచి ఇందిరమ్మ వరద కాలువ ద్వారా 12600 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్ 3200 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు 311.54 మీటర్ల మేరకు ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 13.810 టీఎంసీల మేరకు నిల్వ ఉంది.

ఎస్సారార్‌లో త్వరలో స్పాట్ అడ్మిషన్ల షెడ్యూలు

గణేశ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డిగ్రీలో మిగిలిపోయిన సీట్లను స్పాట్ ద్వారా భర్తీ చేయడానికి త్వరలో ఉన్నత విద్యా మండలి దోస్త్ ద్వారా షెడ్యూలు విడుదల చేయనుందని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.రామకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం బిజినెస్ ఎనలిస్టిక్స్, బీకాం ఫైనాన్స్, బీకాం రిటైల్ ఆపరేషన్స్, బీబీఏ, బి.సి.ఏ, బీఏలో పరిమిత సంఖ్యలో సీట్లు ఖాళీగా ఉన్నాయని త్వరలో విడుదలయ్యే దోస్త్ స్పాట్ అడ్మిషన్ల షెడ్యూల్ ప్రకారం ఖాళీలను భర్తీ జరుగుతుందని తెలిపారు. డిగ్రీలో అడ్మిషన్ పొందడానికి చివరి అవకాశం అని తెలిపారు.

ఎంఎడ్ నాలుగో సెమిస్టర్ షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఎంఎడ్ (మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్) నాలుగవ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డి. సురేష్ కుమార్ మంగళవారం విడుదల చేశారు. పరీక్షలు తేదీ 28 ఆగస్టు నుంచి 3 సెప్టెంబరు వరకు జరగనున్నట్లు తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో, లేదా కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

నాందేడ్- తిరుపతి ప్రత్యేక రైలు పొడిగింపు

వచ్చే ఏడాది మార్చి 28 వరకు

రెగ్యులర్ చేసి, తిరువణ్ణామలై వరకు పొడిగించాలంటున్న ప్రయాణికులు



పెద్దపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జంక్షన్ మీదుగా నడిచే 07015/16 నాందేడ్ నుంచి తిరుపతికి, అక్కడి నుంచి నాందేడ్‌కు నడుస్తున్న ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలను వచ్చే ఏడాది మార్చి 28 వరకు (7 నెలలు) పొడిగించారు. ఇప్పటికే కరీంనగర్ నుంచి తిరుపతికి బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ఆది, గురువారాల్లో నడుస్తున్నది. దీనికి తోడు ఈ నెలలో నాందేడ్ నుంచి తిరుపతి వరకు దక్షిణ మధ్య రైల్వే వారానికి ఒక రోజు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను నడి పిస్తున్నారు.

ఈ రైలు తిరుపతికి వెళ్లే టప్పుడు పెద్దపల్లి జంక్షన్‌కి ప్రతీ శనివారం రాత్రి 10 గంటలకు వస్తుంది. 07016 తిరుపతి నుంచి నాందేడ్ వైపు వెళ్లేటప్పుడు ప్రతీ సోమవారం పెద్దపల్లి జంక్షన్‌కు ఉదయం 8:35 గంటలకు చేరుకుంటుంది. తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడ, బాసర వెళ్లే భక్తులు, ప్రయాణికులు ఈ రైలు ఎంతగానో వినియోగించుకుంటున్నారు. దీనిని ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలుగా కాకుండా రెగ్యులర్ రైలుగా మార్చి వారానికి కనీసం మూడు రోజులు నడిపిస్తే ప్రయాణికులకు ఉపయోగంగా ఉంటుంది.

అలాగే ఈ రైలుకు పెద్దపల్లి నుంచి నిజామాబాద్ సెక్షన్ పరిధిలోని కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్ రైల్వేస్టేషన్‌లలో హాల్టింగ్ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి అరుణాచలం గిరిప్రదక్షిణకు వేలాది మంది భక్తులు వెళుతున్నందున తిరువణ్ణామలై రైల్వేస్టేషన్ వరకు పొడిగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ

గణేశ్‌నగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ కళాశాల టీఎస్‌కేసీ, స్టూడెంట్ ట్రైబ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై శిక్షణ ఇవ్వడానికి, ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి సంయుక్తంగా అవగాహన కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి విద్యార్థులకు ఉపయోగకరమైన ఒప్పందాలను టీఎస్‌కేసీ ద్వారా కళాశాల కుదుర్చుకోవడం జరుగుతుందని తెలిపారు. స్టూడెంట్ ట్రైబ్ ఆర్గనైజేషన్ రిసోర్స్ పర్సన్ స్నేహ రామినేని, కరీంనగర్ టీమ్ మెంబర్స్ రూపాలి, చంద్రకిరణ్, సుమిత్ పాల్గొని విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధిపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. దాదాపు 200 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని శిక్షణ పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ పి రాజేష్‌ను ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్ రామకృష్ణ అభినందించారు.

నేటితో ముగిసిన ముహూర్తాలు

- 24 నుంచి భాద్రపద మాసం
- ఈ సారి సంపూర్ణ చంద్రగ్రహణం
- తిరిగి అక్టోబరు, నవంబరులో శుభకార్యాలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఈ యేడు బుధవారంతో ముహూర్తాలు ముగిశాయి. 23వ తేదీతో శ్రావణ మాసం ముగిసి శూన్య మాసంగా చెప్పుకునే భాద్రపద మాసం 24వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ముహూర్తాలు లేకున్నా విఘ్నేశ్వర నవరాత్రులు, పలు వ్రతాలు భాద్రపదంలోనే వస్తాయి. పితృదేవతారాధన లకు అనుకూల మాసం కాగా విష్ణువుకు ప్రీతికర మాసమని శాస్త్రాలు, పురాణాలు చెబుతున్నాయి. పూజలు, వ్రతాలతో విశేష ఫలితాలు పొంద వచ్చని పండితులు చెబుతున్నారు. సెప్టెంబరులో ముహూర్తాల కరువు ఏర్పడగా అక్టోబరు 23 నుంచి నవంబరు 15 వరకు శుభముహూర్తాలు న్నాయి. సెప్టెంబరు 7న సంపూర్ణ చంద్రగ్రహణం సంభవించనుంది.

● పండుగలివే

ఆగస్టు 27 వినాయక చవితి, సెప్టెంబర్ 7 చంద్రగ్రహణం, 15 వైష్ణవ కృష్ణాష్టమి, 21 మహాలయ అమావాస్య (పెతరామాస) -బతుకమ్మ వేడుకలు ప్రారంభం, 22 శరన్న వరాత్రులు ప్రారంభం, 29 మూలా నక్షత్రం, 30 దుర్గాష్టమి, అక్టోబరు 1 మహర్నవమి, 2 విజయదశమి, 19 ధనత్రయోదశి, మంగళ హారతులు, 20 దీపావళి-ధనలక్ష్మీ పూజలు

● శుభ ముహూర్తాల తేదీలు ఇవే...

అక్టోబరులో 24, 26, 29, 30, 31 తేదీలు. నవంబరులో 1, 7, 8, 13, 15 తేదీలు.

వేములవాడలో రద్దీ..

రాజన్నను దర్శించుకున్న కేసీఆర్ సతీమణి శోభ

వేములవాడ కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రావణ మాసం రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

రాజరాజేశ్వర స్వామివారికి ఆర్ద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి వారికి ఉదయం 5.30 గంటల నుంచి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన చేపట్టారు. సాయంత్రం 6.05కు స్వామి వారి కల్యాణ మంటపంలో సదస్యను చేపట్టారు.


కేసీఆర్ సతీమణికి రాజన్న చిత్రపటం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాజన్న సేవలో కేసీఆర్ సతీమణి..

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని మాజీ సీఎం కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం ఆలయానికి మనుమడు హిమాన్షుతో (కేటీఆర్ తనయుడు) కలిసి వచ్చిన ఆమెకు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పూల మొక్క లు అందజేశారు. అనంతరం రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయాధికారులు ప్రసాదాన్ని అందజేశారు.


బద్ది పోచమ్మ ఆలయం వద్ద బోనాలతో క్యూలైన్‌లో భక్తులు

బద్ది పోచమ్మకు బోనం మొక్కులు

శ్రావణ మాస మంగళవారం సందర్భంగా వేములవాడ బద్ది పోచమ్మ తల్లికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నెత్తి న బోనాలతో భక్తులు అమ్మవారి దర్శనం కోసం సుమారు 5 గంటలు క్యూలైన్‌లో నిరీక్షించినట్లు భక్తులు వెల్లడించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

పోచమ్మ ఆలయంలో పూజలు

జగిత్యాల క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పురాణీ పేటలో ఉన్న శ్రీ లోకమాత పోచమ్మ తల్లి ఆలయంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ మంగళ వారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ వార్షికోత్సవ వేడుకల ప్రచార రథాన్ని ప్రారంభించి మాట్లాడారు. బుధవారం నుండి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న వార్షికోత్సవ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గాజులరాజేందర్, రాజగోపాల చారి, రాఘవ చారి, గంగాధర్, చంద్ర ప్రకాష్, మునీందర్, హరికృష్ణ, సత్యజిత్, ప్రవీణ్, భద్రయ్య తదితరులు ఉన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

కోరుట్లరూరల్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామంలో మంగళవారం కోరుట్ల లయన్స్ క్లబ్, గ్రామ అదర్శ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో రేకూర్తి వైద్యుల సహాకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించంగా విశేషస్పందన లభించింది. 75మంది గ్రామస్థులకు నేత్ర వైద్య పరీక్షలను నిర్వహించారు. 22మందికి మోతె బిందు శస్త్రచికిత్స అవసరం ఉండంగా వారిని ప్రత్యేక వాహనం ద్వార లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో రేకూర్తి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కోమ్ముల జీవన్‌రెడ్డి, ఏలేటి లక్ష్మారెడ్డి నల్ల గంగాధర్, గుంటుక సురేష్‌బాబు, అజయేంధర్‌రావు, ఉషాకిరణ్, కూందారపు మహేందర్, కేజీ కృష్ణ, కల్లెం గంగారెడ్డి, బెజ్జంకి శ్రీనివాస్, రాంనారాయణ, ఆదర్శయూత్ సభ్యులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో 'మానస' విద్యార్థి ప్రతిభ

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మానస స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి అద్వైత్‌స్కేటింగ్‌లో అద్భుత ప్రతిభను కనబర్చాడని పాఠశాల ప్రిన్సిపాల్ రజితరావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని బొరంపేట శ్రీరామ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్కేటింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అద్వైత్ మూడు రికార్డులతో తన ప్రతిభను చాటాడన్నారు. 79 నిమిషాల పాటు నిరంతరంగా స్కేటింగ్ చేస్తూ ఈ ఘనత సాధించాడని ఆమె పేర్కొన్నారు. అద్వైత్‌ను పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన అధికారులు

మల్లాపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, రెండవ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో శశికుమార్‌లు సందర్శించారు. వరుసగా కురుస్తున్న వర్షాల తాకిడికి పాఠశాలలో స్లాబ్ పెచ్చులు ఊడి కింద పడిన విషయంను మండల కాంగ్రెస్ నాయకులు నల్లరాజన్న అధికారులకు తెలిపారు. దీంతో అధికారులు పాఠశాలను సందిర్శించి మరమత్తులు జరిపించాలని స్థానిక అధికారులకు సూచించారు. పెచ్చులు ఉడిపడిన సమయంలో విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

బోధనోపకరణాలు.. నైపుణ్య బోధనకు సూచికలు

● జిల్లా వ్యాప్తంగా టీఎల్‌ఎం మేళాలు ● అర్థవంతమైన బోధనే లక్ష్యం

వెల్గటూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) అమలు పరిచేలా రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టింది. విద్యార్థులకు ఎక్కువ కాలం గుర్తుండే రీతిలో బోధన చేయడానికి బోధనాభ్యసన మెరుగు పరిచేలా బోధనోపకరణాలు దోహదం చేస్తాయి. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించడానికి ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో మెరుగైన, నాణ్యవంతమైన బోధనను అందించేందుకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో టీఎల్‌ఎం మేళాల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. టీఎల్‌ఎం మేళాలో జిల్లా లోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు పాల్గొనాలని జిల్లా విద్యాధికారి రాము ఆదేశాలు జారీ చేశారు.



విద్యార్థులతో కలిసి బోధనోపకరణం తయారు చేస్తున్న ఉపాధ్యాయుడు

జిల్లాలోని 477 ప్రాథమిక, 83 ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఒక్కో సబ్జెక్టుకు రెండు చొప్పున టీఎల్‌ఎం మేళాలో ప్రదర్శించనున్నారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని మండలాలలో టీఎల్‌ఎం మేళాలు నిర్వహించగా మరికొన్ని మండలాలలో మేళాల నిర్వహణకు సిద్ధం చేస్తున్నారు. అన్ని మండలాలలో ఈ ప్రక్రియ పూర్తి కాగానే ప్రతీ మండలం నుంచి ఎంపిక చేసిన 10 ఉత్తమమైన టీఎల్‌ఎంలతో జిల్లా స్థాయిలో టీఎల్‌ఎం మేళా నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో ఎనిమిది ఉత్తమమైన బోధనోపకరణాలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి అధికారులు పంపనున్నారు.

● టీఎల్‌ఎం ప్రయోజనాలు

సమర్థవంతమైన బోధనకు బోధనోపకరణాలు ఎంతగానో ఉపయోగపడతాయి. కృత్యాధార బోధనతో విద్యార్థులు ఎక్కువ జ్ఞానం పొంది ఎక్కువ కాలం గుర్తుంచుకునే అవకాశం ఉంటుంది. వినడం, చూడడం, ప్రత్యక్షంగా పాల్గొనడంతో విద్యార్థులు ఎక్కువగా అవగాహన పొందుతారని మనో విజ్ఞాన శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. విద్యార్థులు చూడడం ద్వారా 83 శాతం, వినడం ద్వారా 11 శాతం, రుచి ద్వారా 1 శాతం, స్పర్శ ద్వారా 1.5 శాతం, వాసన ద్వారా 3.5 శాతం జ్ఞానాన్ని పొందుతారని మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతో ఉపాధ్యాయులు బోధనోపకరణాలను వాడుతూ విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించడానికి కృషి చేస్తున్నారు.

● ఎంపిక విధానం

టీఎల్‌ఎం సులభంగా అందుబాటులో ఉన్న మెటీరియల్, పునర్వినియోగపరచదగిన మరియు పర్యావరణ అనుకూల వస్తువులతో తయారు చేసిన వాటికి ప్రాధాన్యత ఇస్తారు. ప్రతీ మండలం నుంచి 10 ఉత్తమ టీఎల్‌ఎం ప్రదర్శనలను (తెలుగు/ఇంగ్లీష్/ఉర్దూ మాధ్యమం) ఎంపిక చేసి, జిల్లా స్థాయికి పంపిస్తారు. మండల స్థాయి టీఎల్‌ఎం మేళాలో ఉత్తమ టీఎల్‌ఎంను ఎంపిక చేయడానికి ముగ్గురు జ్యూరీ సభ్యులు పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్న ఉత్తమ టీఎల్‌ఎంలను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు. జిల్లా విద్యాధికారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో టీఎల్‌ఎం మేళా నిర్వహిస్తారు. అన్ని మండలాల నుండి వచ్చిన ప్రదర్శనలను ఆరుగురు నిపుణుల జ్యూరీ సభ్యులు పరిశీలించి 8 ఉత్తమ ప్రదర్శనలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు.

● అభ్యసనా సామర్థ్యాలు పెంపు

-బోనగిరి ప్రభాకర్, వెల్గటూర్ ఎంఈవో



ఉపాధ్యాయులు బోధనోపకరణాల ద్వారా బోధన చేయడంతో విద్యార్థుల్లో కనీస అభ్యసనా సామర్థ్యాలు పెంపొందుతాయి. వినూత్నంగా ఉన్న బోధనోప కరణాలు ఆకట్టుకునేలా చేసి విద్యార్థుల్లో నేర్చుకోవాలనే కుతూహలం పెరుగుతుంది. టీఎల్‌ఎంల ద్వారా ఉపాధ్యాయుల్లో బోధనా నైపుణ్యం పెంపొందుతుంది. ఉన్నతాధికారుల మార్గదర్శకాలకు అనుగుణంగా టీఎల్‌ఎం మేళా నిర్వహిస్తాం.

పాత పద్ధతిలోనే ఎస్సెస్సీ పరీక్షలు

(ఐదో పేజీ తరువాయి)

రెండు నెలల తర్వాత ప్రభుత్వం వార్షిక పరీక్షలు, ఇంటర్నల్ మార్కులపై ఆదేశాలు ఇవ్వడం వల్ల విద్యార్థులు నష్ట పోయే ప్రమాదం ఉందని కొంత మంది ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో గందరగోళ పరిస్థితులు

-భైరం హరికిరణ్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు



విద్యా సంవత్సరం ప్రారంభమైన రెండు నెలల తర్వాత విద్యాశాఖ ఇంటర్నల్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఆదేశాలివ్వడంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం నిర్ణయంతో విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఇంటర్నల్ విధానాన్ని రద్దు చేసి 100 మార్కులకే వార్షిక పరీక్షలు నిర్వహించాలి.

సర్కారు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

-తిరుక్కోవెల శ్యామ్ సుందర్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు



పదో తరగతి పరీక్షలను పాత పద్ధతిలో నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులు ఇంటర్నల్ మార్కులతో ఉత్తీర్ణత పొందే అవకాశాలు ఉంటాయి. ప్రభుత్వం సరియైన నిర్ణయం తీసుకుంది.

వంద మార్కులకు పరీక్షలు నిర్వహించాలి

-బోయినిపల్లి ఆనందరావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు



పదో తరగతి వార్షిక పరీక్షలను వంద మార్కుల విధానంతోనే నిర్వహించాలి. ఇంటర్నల్ మార్కుల విధానం వల్ల ఫలితాలు సక్రమంగా రావడం లేదు. ఇంటర్నల్ మార్కుల విధానంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

డ్రైనేజీల్లో ప్లాస్టిక్ సీసాలు పడేయొద్దు

-మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్

మెట్‌పల్లి టౌన్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): మురికి కాలువల్లో ప్లాస్టిక్ బాటిళ్ల పడేయొవద్దని మున్సిపల్ కమిషనర్ మోహన్ పేర్కొన్నారు. మంగళవారం మెట్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డులలో పారిశుద్ధ్య పనులను, వర్షపు నీరు వెళ్లే ప్రవాహక ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ 7, 18, 20, 22వ వార్డుల్లో మెయిన్ డ్రైనేజ్ పారిశుద్ధ్య పనులను పరిశీలించామన్నారు. పట్టణ ప్రజలు వాడి పారేసిన ప్లాస్టిక్ బాటిల్స్‌ను మురికి కాలువలలో వేయడం వలన మురికి నీరు ఆగిపోయి మురికి నీరు నిండి రోడ్లపైకి వస్తున్నదన్నారు. మురికి నీరు తీయటానికి పారిశుధ్య సిబ్బంది మ్యానువల్స్ లో దిగి మురికి నీరు తీయాల్సి వస్తుందని, ప్రజలు ప్లాస్టిక్ బాటిల్స్ ను కాలువలలో వేయకుండా మున్సిపల్ ఆటోలకు అందివ్వాలని కోరారు. లోపల దిగి తీసిన పారిశుధ్య సిబ్బంది మోహన్‌ను కాలనీవాసులు సన్మానించారు. భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలని వార్డు ఆఫీసర్లు శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి ప్రజలను ఖాళీ చేయించాలని కమిషనర్ గారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ విష్ణు ముజీబ్ పాల్గొన్నారు

కొండగట్టులో భక్తుల రద్దీ



అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధి భక్తులతో రద్దీగా మారింది. శ్రావణ మంగళవారం చివరి రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొవడానికి బారులు తీరారు. అనంతరం అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. బేతాళుడు, రాముల వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ఉదయం నుంచి వర్షం కురువగా వర్షంలోనూ భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది.

నమో మిషన్ అధ్యక్షుడిగా హరీష్

జగిత్యాలఅర్బన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నమోమిషన్ వందే గౌమాతారం హైదరాబాద్‌లోని తెలంగాణ విభాగం అధ్యక్షులుగా జగిత్యాల పట్టణానికి చెందిన కచ్చు హరీష్ యాదవ్‌ను నియమిస్తూ వందే మిషన్ ప్రెసిడెంట్ మరియు ఫౌండర్ వీర మాదవి రాజ్ ఆచారి సీపెల్లి ఉత్తర్వులు జారీ చేశారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్

బీర్‌పూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లి గ్రామంలో మంగళవారం హెల్త్ సిబ్బంది ఆధ్వర్యంలో టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి పలు సూ చనలు చేశారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో కుద్దీష్, హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్‌ఎంలు కళావతి, లక్ష్మీ పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

కొడిమ్యాల, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్‌కి చెందిన సుంకె సత్తవ్వ పీఎం జేజేబీవై పథకంలో సంవత్సరానికి 436 రూపాయలను చెల్లించింది. ఇటీవల ఆమె మృతి చెందగా మంగళవారం మృతురాలి కుమారుడు నామిని నరేష్‌కు ప్రమాద బీమా 2లక్షల రూపాయల చెక్‌ను యూనియన్‌బ్యాంక్ మేనెజర్ సంజీవ్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో ఆర్డీవో గజానన్, అసిస్టెంట్ మేనెజర్ సంజయ్ కుమార్, గోల్డ్ అప్రైజర్ స్వామి, టీసీ. ప్రమోద్‌రావు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

-అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

ధర్మపురి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి వరద మంగళవారం ఉధృతంగా ప్రవహిస్తోంది. ధర్మపురి మండలంలోని ఆరెపల్లి, దొంతాపూర్, జైనా, రాజారం, దమ్మన్నపేట, తిమ్మాపూర్, రాయపట్నం నదీ తీరాన గల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, రవికుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు వరద పరిస్థితి సమీక్షించారు.

●మల్లాపూర్: మండలంలోని ఆయా ప్రాంతాల్లో గల గోదావరి నది మంగళవారం ఉధృతంగా ప్రవహిస్తోంది. నది తీర ప్రాంతాలకు ఎవరూ వెళ్లకూడదని రెవెన్యూ, పోలీసు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

●వెల్గటూర్: మండలంలోని కోటిలింగాల వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ శేఖర్, సీఐ రాంనర్సింహారెడ్డి హెచ్చరించారు.

●బీర్‌పూర్: మండలంలోని రంగసాగర్, మంగేళ, కమ్మునూర్, చిత్రవేణిగూడెం, రేకులపెల్లి, చిన్నకొల్వాయి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, ఎంపీడీవో భీమేష్, కార్యదర్శులు, రెవేన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్కపెల్లి చెరువుకు జల కళ

ధర్మపురి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని బురుదేశిపల్లె సమీపంలోని అక్కపెల్లి చెరువు జల కళ సంతరించుకుంది. గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షానికి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని గుట్టల పైనుంచి వచ్చే వరద నీరు వాగుల ద్వారా ఈ చెరువులోకి చేరుతోంది. తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది చెరువును పరిశీలించారు. భారీ వర్షానికి మండలంలోని రాయపట్నం గ్రామంలో ఒక ఇళ్లు కూలిపోయింది. ధర్మపురి పట్టణంలోని బోయవాడలో గంధం లక్ష్మమ్మ ఇంటి ప్రహారీ గోడ కూలిపోయింది. పెద్ద ప్రమాదం తప్పింది. అక్కడే విద్యుత్ స్తంభం వంగి కింద పడే అవకాశం ఉండగా వీధి ప్రజలు తాళ్లతో కట్టి ఉంచారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ కూలిపోయిన గోడను పరిశీలించారు. మండల డిప్యూటీ తహసీల్దార్ సుమన్, ట్రాన్స్‌కో ఏఈఈ రవితో ఫోన్ ద్వారా మాట్లాడి పరిస్థితి గురించి వివరించారు.

వరద నీటితో నిండిన తహసీల్దార్ కార్యాలయం ఆవరణ

-ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, ప్రజలు



వరద నీటి నుంచి నడిచి తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్న మహిళలు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జగిత్యాల పట్టణంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణ నీటితో నిండిపోయింది. దీంతో కార్యాలయానికి వివిధ పనులకోసం వచ్చే ప్రజలు, సిబ్బంది వర్షం నీటిలో నుంచే నడుచుకుంటూ వస్తున్నారు. జిల్లా కేంద్రంలో అర్బన్, రూరల్ రెండు తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్ళడానికి ఒకటే దారి ఉండడంతో కార్యాలయాలకు వచ్చే వారితో పాటు అధికారులు కూడా ఆదే బురద నీటిలోనుండి విదులకు హాజరవుతున్నారు.

పలువురికి పీహెచ్‌డీ ప్రదానం

ధర్మపురి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గుండి శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్ పీహెచ్‌డీ సాధించి మంగళవారం పట్టాలు పొందారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీలో గుండి శ్రీనివాస్ సంస్కృతంలో, రాపర్తి శ్రీనివాస్ తెలుగు ఓరియంటల్ విభాగంలో గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ, ఇస్రో చైర్మన్ నారాయణ, ఉస్మానియా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ కుమార్ మొలుగూరి చేతుల మీదుగా పట్టాలు పొందారు. ధర్మపురి పట్టణానికి చెందిన వీరిద్దరు పట్టాలు సాధించడం పట్ల పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

పెగడపల్లి యువకుడికి..

పెగడపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లికి చెందిన కోలపురి చంద్రశేఖర్ అనే యువకుడు మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నాడు. ఉస్మానియాలో పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో భారత రాజకీయాలు ఎన్నికల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కొత్త విధానాల పైన చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను పలువురు అభినందించారు.

పంటలకు చేరిన వరద కాలువ నీరు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మనగర్ గ్రామ తండా శివారులోని పంట పొలాలకు మంగళవారం వరద కాలువ నీరు చేరింది. జగ్గసాగర్ శివారులోని మాన్వూరు వాగు వద్ద వరద కాలువ, ఆత్మకూర్ పెద్దవాగు కలుస్తాయి. వరదకాలువ ఉధృతంగా పారడంతో మాన్వూర్ వాగులోకి చేరింది. ఆత్మకూర్ పెద్దవాగు నుంచి ఎగువన నీటి మట్టం పెరిగి ఆత్మనగర్ పెద్దతండా శివారులోని పంట పొలాల్లోకి నీరు చేరింది. సుమారు 15 నుంచి 20 ఎకరాల పొలాలకు వరదకాలువ నీరు చేరిందని రైతులు వాపోతున్నారు. వరద కాలువలోకి నీటి మట్టం పెరిగిన ప్రతి సంవత్సరం నీరంతా పొలాల్లోకి వెళ్లి పంటలను ముంచుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు మాన్వూర్ వాగు వద్ద గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదలాలని రైతులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ డీఈ అరుణోదయ్ వరుద కాలువను పరిశీలించారు. సమస్యను ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు చెల్లింపు

కథలాపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో బేస్‌మెంట్ స్థాయిలో 81 ఇందిరమ్మ ఇళ్ళకు బిల్లుల చెల్లింపు ప్రక్రియ పూర్తి చేశామని ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేసేలా ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీ కార్యదర్శులతో పర్యవేక్షణ చేపడుతున్నామన్నారు. పోసానిపేటలో 91 మంది లబ్ధిదారులు తాము ఇళ్ళు నిర్మించుకునే పరిస్థితుల్లో లేమని రాతపూర్వకంగా రాసి ఇచ్చారని వాటిని రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కథలాపూర్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబారి పేటలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూ రైన చెక్కులను కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జవ్వాజి షర్మితకు రు. 19,500, తోట దేవయ్యకు రు. 18 వేలు, మంచాల అంజలికి రు. 37,500ల చొప్పున మంజూరైన చెక్కులను అందజేశారు. అదేవిధంగా కలికోటలో కల్లెడ రాధకు రు. 25 వేల చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రధాన కార్యదర్శి జవ్వాజి రవి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, తిక్క రవి, జవ్వాజి మల్లారెడ్డి, షేర్ రాజం, రాచమల్ల నవీన్ తదితరులు ఉన్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై కేసు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో నలుగురు వ్యక్తులు అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై కులం పేరుతో దూషించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆత్మకూర్ గ్రామంలోని వాగు నుంచి ఇసుకను మెట్‌పల్లికి తరలిస్తుండగా ట్రాక్టర్‌కు గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు అడ్డుకున్నారు. అక్కడ జరిగిన గొడవలో కులం పేరుతో దూషించారని బాధితుడు మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌ల్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామన్నారు. కేసును మెట్‌పల్లి డీఎస్పీ రాములు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ప్రభుత్వ అనుమతితోనే ఇసుక రవాణా

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో ప్రభుత్వం గుర్తించిన రీచ్ నుంచి కలెక్టర్ అనుమతితోనే ఇసుక తరలించడం జరుగుతుందని, ఇసుక రవాణాకు అడ్డుపడితే చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి తహసీల్దార్ నీత, సీఐ అనిల్‌కుమార్‌లు హెచ్చరించారు. పోలీసుల నేతృత్వంలో గ్రామ సభ నిర్వహించి మంగళవారం గ్రామస్థులతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కథలాపూర్ మండలంలో నిర్మిస్తున్న సూరమ్మ ప్రాజెక్టు కోసం ఆత్మకూర్ వాగు నుండి ఇసుక తరలించడానికి కలెక్టర్ ఆదేశాల మేరకు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్సై కిరణ్‌కుమార్, ఆర్ఐ ఉమేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

కోరుట్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఫోటోగ్రాఫిక్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరా క్లబ్ సభ్యులు కేకును కట్టు చేసి నిరుపేదలకు అన్నదానం చేసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు బుకులను అందించారు. అదే విధంగా లయన్స్ క్లబ్ అధ్వర్యంలో కెమెరా క్లబ్ సభ్యులకు సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో కెమెరా క్లబ్ సభ్యులు అల్లె అనంద్, శంకర్, చలిగంటి వినోద్ కుమార్, శికారి దత్తు, అడెపు శ్యాం, గుంగుల రాజశేఖర్, రుద్ర అజయ్, సోరపాక రవీ, నల్ల శివ, బండ్ల సురేష్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



కోరుట్లలో ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

●మెట్‌పల్లి టౌన్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వరల్డ్ ఫొటోగ్రఫీ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కళాంజలి స్టూడియో గుండ రాకేష్‌ను లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెల్ముల శ్రీనివాస్ రావు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ జైపాలరెడ్డి, కోశాధికారి చంద్ర శేఖర్, ఇల్లెందుల శ్రీనివాస్, దొంతుల అంజనే యులు, ముత్యం రమేష్, కిషన్, కొండస్వామి, గంగాధర్, సత్యనారాయణ లయన్ సభ్యులు పాల్గొన్నారు.

●ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల ఫొటోగ్రాఫర్ల కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యకుడిగా క్యాతం రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా పసునూరి సురేందర్, ప్రధాన కార్యదర్శిగా మర్రిపెల్లి మురళి, కోశాధికారిగా రాఘవేందర్‌ను ఎన్నుకున్నారు.

●గొల్లపల్లి: గొల్లపల్లి మండల కేంద్రంలో 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఫొటోగ్రాఫర్లు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకుని వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఫోటో విడియో మిక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు పొనగంటి రాజరత్నం, కార్యదర్శి సజ్జనపు జనార్ధన్, కోశాధికారి బొడిగ గంగాధర్, ఉపాధ్యక్షులు గుండె తిరుపతి, సహాయ కార్యదర్శి అల్లె ప్రవీణ్, ముఖ్య సలహాదారు ఎం.డీ. ఖాజామియా, తూర్పాటి రవి, కొల్లూరి స్వామి ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

●పెగడపల్లి: పెగడపల్లి మండల కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశమై కేక్ కట్ చేసి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సీగిరి జీవన్, మూల జనార్దన్ రెడ్డి, గంద్ర అఖిల్ రావు, మ్యాకల సుధాకర్, లెంకలపల్లి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

●మల్యాల: ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం మల్యాలలో ఫొటోగ్రాఫర్లు కేకు కట్ చేశారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్, పలు అవార్డుల గ్రహీత మండలోజు శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. రాజశేఖర్, నవీన్, సంపత్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

'సమర్థ బోధనకు టీఎల్‌ఎంలు దోహదం'

ధర్మపురి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల టీఎల్‌ఎం మేళాను మున్సిపల్ కమీషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు మంగళవారం ప్రారంభించారు. ఈ మేళాలో 168 టీచింగ్ లర్నింగ్ మెటీరియల్స్‌ను టీచర్లు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఎంఈవో సీతాలక్ష్మి, ధర్మపురి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పెండ్యాల మహేందర్ పాల్గొన్నారు.

●ఇబ్రహీంపట్నం: మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మండలస్థాయి ఎఫ్ఎల్ఎన్ బోధనాభ్యసన మేళాను ఎంఈఓ బండారి మధు ఆధ్వర్యంలో నిర్వహించారు.

●కొడిమ్యాల: విద్యార్థులకు బోధనా భ్యాసన సామగ్రితో సులువుగా అర్థమయ్యేలా బోధించాలని ఎంపీడీవో స్వరూప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో ఎంఈవో ఎ. శ్రీనివాస్ అధ్యక్షతన మండల స్థాయి (టీఎల్‌ఎం)టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో ఎంఈవో శ్రీనివాస్, ప్రదానోపాధ్యాయులు అచివిజయేంద్ర, శ్రీనివాసరాజు, జ్యోత్స్నదేవి పాల్గొన్నారు.

●కథలాపూర్: ఉపాధ్యాయులు రూపొం దించిన బోధనాభ్యసన సామాగ్రితో విద్యార్థుల్లో సృజనాత్మకతకు మరింత పదును పెట్టినట్టుగా ఉంటుందని ఎంపీడీఓ శంకర్‌నాయక్, తహసీల్దార్ వినోద్ పేర్కొన్నారు. కథలాపూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రాథమిక పాఠశాలల మండల స్థాయి టీఎల్‌ఎం మేళాను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లోకిని శ్రీనివాస్, పలు పాఠశాలల ప్రదానోపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి ఫుడ్ కారెంటర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. నూతన పాలక మండలి అధ్యక్షులుగా ఎదులాపురం కుమార్, ప్రధాన కార్యదర్శి గా మండలోజి గంగాధర్, కోశాధికారిగా శంభోజి సత్యానారాయణ, ఉపాధ్యక్షులుగా వనతడుపుల నరసయ్య, ఉప కార్యదర్శిగా చాట్లపల్లి రాజేంద్రప్రసాద్‌లు ప్రమాణ స్వీకారం చేశారు.

మాజీ సర్పంచ్ మృతి

ధర్మపురి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ మామిడాల శంకరయ్య గుండెపోటుతో మృతిచెందాడు. 2013 నుండి 2018 వరకు శంకరయ్య తిమ్మాపూర్ సర్పంచ్‌గా పనిచేశారు. రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, ధర్మపురి మాజీ జడ్పీటీసీ సౌళ్ల భీమయ్య నివాళులర్పించారు.

సాగుపై అవగాహన

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వ్యవసాయంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామంలో అవగాహన కల్పించారు. మంగళవారం గ్రామంలోని రైతు వేదికలో బీఎస్సీ అగ్రికల్చర్ నాలుగో సంవత్సరం బీజేఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ భాగస్వామ్యతో విశ్లేషణ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్ర కరీంనగర్ కోఆర్డినేటర్ హరికృష్ణ, శాస్త్రవేత మదన్ మోహన్‌రెడ్డి, అరుణ్‌బాబు పాల్గొన్నారు.

మురుగు నీటి కాల్వలను ఏర్పాటు చేసుకోవాలి

కొడిమ్యాల, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున పత్తి, మొక్కజొన్న, వరి పంటలో నిలిచిన నీరు తొలిగించడానికి మురుగు కాల్వలను రైతులు ఏర్పాటు చేసుకోవాలని మండల ఏవో పి. జ్యోతి కోరారు. మంగళవారం ఏవో మాట్లాడుతూ భారీ వర్ష సూచన ఉన్నందున వీలైనంత త్వరగా పంటలలో నిలిచిన నీటిని తొలిగించుకోవాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనె రైతులు 19-19-19ను 5గ్రాంలు లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట పోలాల్లో మోబైల్ ఫోన్లను ఉపయోగించ కూడదన్నారు.